వైభవంగా జగన్నాథ రథయాత్ర

మిర్యాలగూడ జగన్నాథుడి రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి , ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడటౌన్, జూలై13 : భక్తి వేదాంత ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో శనివారం జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. ఈ రథయాత్రను ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరుభార్గవ్‌తో కలిసి పరమహంస ప్రభూజీ ప్రారంభించారు. భక్తుల మేళతాళాలు,హర్షధ్వానాల మధ్య పురవీధుల్లో స్వామివారి ఊరేగింపును నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దరిచేరవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తగు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులను నిత్యం పర్యవేక్షించాలి

- ఎస్పీ శరత్ చంద్రపవార్
- వాడపల్లి సరిహద్దు చెక్ పోస్ట్ తనిఖీ

వాడపల్లి సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ

దామరచర్ల, జూలై 13 : జిల్లాలోని అంతర్రాష్ట్రాల సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని వాడపల్లి సరిహద్దు చెక్‌పోస్టును శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆంధ్రా నుంచి తెలంగాణ వైపునకు వస్తున్న లారీలను స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్రాష్ట్ర సరిహద్దు ఇరురాష్ట్రాల నుంచి అక్రమ రవాణ అవుతున్న గంజాయి,మాదకద్రవ్యాలు, రేషన్ బియ్యంపై నిఘా పెట్టాలన్నారు. అక్రమ రవాణాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో 24/7 గంటలు తనిఖీలు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచివచ్చే ప్రతి వాహనాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

యాదాద్రి పవర్‌ప్లాంటును పరిశీలన

మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంటును ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శనివారం పరిశీలించారు. ప్లాంటులో అన్ని విభాగాలను స్థానిక అధికారుల కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్లాంటులో ఉన్న భద్రత, నిఘాపై ఆయన ఆరాతీశారు.

ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి

శంకరయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

కట్టంగూర్, జూలై 13 : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళి అన్నారు. ఉపాధి కరువై ఆత్మహత్య చేసుకున్న కట్టంగూర్‌కు చెందిన ఏలె శంకరయ్య కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా శంకరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. ఉపాధి కరువై అప్పుల బాధతో ఎనిమిది మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వ పట్టించుకోవడం లేదని విమర్శించారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బొమ్మగాని ప్రసాద్, బొమ్మ రాములు, గంజి శంకరయ్య శ్రీను ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు

నకిరేకల్ : శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న నాగరాజు

నకిరేకల్, జూలై 13 : విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు హెచ్చరించారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నల్లగొండ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు కల్లు రామచంద్రారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేశ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి అని చెప్పిన రేవంత్‌రెడ్డి సర్కార్‌కు విద్యార్థుల స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కనబడడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుంటుపడిపోతుందని, రాష్ట్రంలో వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యావ్యవస్థను గాడిన పెట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభం అయి నెల రోజులు కావొస్తున్నా ఇప్పటికీ హాస్టళ్లకు నోట్‌బుక్స్, బట్టలు, దుప్పట్లు ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. రాత్రి 11 గంటలకు సైతం కలెక్టరేట్ ముందు ధర్నాలు చేస్తున్నారంటే రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఏ విధంగా ఉందో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కమ్మంపాటి శంకర్, నాయకులు వెంకన్న, మల్లం మహేశ్, రాచకొండ వెంకన్న, కృష్ణ, కుంచం కావ్య, రమావత్ లక్ష్మణ్ నాయక్, సైదా, కోరే రమేశ్, ముసుకు రవీందర్, బుడిగ వెంకటేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ప్లాట్ అమ్మబడును

కోదాడ బస్టాండ్ పక్కన, మాత నగర్ వాటర్ ట్యాంక్ అపోజిట్‌లో గల ఓపెన్ ప్లాట్ అమ్మబడును. వివరాలకు సంప్రదించగలరు సెల్:6302986551, 8897494829.
NLG-

లింకు డాక్యుమెంట్ పోయినది

పత్తిపాక నాగేశ్వరి, భర్త మురళి, గ్రామం తుల్జారావుపేట మండలం చివ్వెంల జిల్లా సూర్యాపేట అను పేరుగల సర్వే నెంబరు 59లో 182 గజాల రిజిస్టర్ లింక్ డాక్యుమెంట్ నెంబర్ 2495/1996 ది:11.7.1996 అను డాక్యుమెంటు అనంతారం నుండి పెన్‌పహాడ్ వెళుతుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికినవారు సంప్ర: సెల్:9848474940.
NLG-

PLOT FOR SALE

★YTDA Final Approved 92 Acres Mega Venture @ Bhuvanagiri Town Open Plots for Sale. Opp: Viver Hotel & Collectorate Building 100, 60, 40, 30 All CC Roads & Beautiful Parks, Avenue Plantation, Bank Loans AVL. 9949997199 / 9440415567 / 9866863131.
NT-327685

TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను దశల వారీగా చెల్లిస్తాం
- మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్లగొండలో సావిత్రీబాయి, జ్యోతిబా పూలేల విగ్రహావిష్కరణ

జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, జూలై 13 : బీసీ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ భవన్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే , సావిత్రీబాయి పూలే విగ్రహాలను రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డితో కలిసి శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. సావిత్రీబాయి పూలే మహిళ చదువు కోసం ఎంతో కృషి చేశారని, పాఠశాలలు స్థాపించారని అన్నారు. ప్రభుత్వం బీసీల సంక్షేమ కోసం కట్టుబడి ఉందని ,ఇం దులో భాగంగానే బీసీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేశామన్నారు. కులగణన చేపట్టేందుకు నిర్ణయించామని, అలాగే రూ.150 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను దశాల వారీగా చెల్లిస్తామన్నారు. గురుకులాల్లో, వసతి గృహాల్లో ఉండి విద్యాను అభ్యసిస్తున్న విద్యార్థులకు భోజనం, వసతి, దుస్తుల, సౌకర్యాలను కల్పిస్తామన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు రూ.25 వేల పింఛన్‌తో పాటు 250 గజాల ఇంటి స్థలం త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ. 80 కోట్లతో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లను నిర్మించనున్నట్లు తెలిపారు. జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే ఆశయాలకు అనుగుణంగా అందరూ పని చేయాలన్నారు. జిల్లాలో బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎమ్మెల్యే నిధులు రూ.1.20 కోటి నిధులు మంజూరు చేస్తానన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ , జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, కాసోజు విశ్వనాథం, నకిరేకంటి కాశయ్య గౌడ్, నేలపట్ల సత్యనారాయణ,జిట్టబోయిన ఆంజయ్య ముదిరాజ్, శంకర్, వివిధ కుల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నల్లగొండ సిటీ: కనగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను మంత్రులు పొన్నం ప్రభాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ పద్మ, ఆర్ఐ మర్రి యాదగిరి, నాయకులు రాంచంద్రారెడ్డి, అనూప్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాసగౌడ్,రాజిరెడ్డి, కనగల్ మాజీ సర్పంచ్ కిష్టయ్య ఉన్నారు.

కార్గో హమాలీ కూలీ పెంచాలని మంత్రికి వినతి

ఆర్టీసీ డిపోలో ఎగుమతి, దిగుమతి నిర్వహిస్తున్న హమాలీలకు, స్వీపర్లుకు వేతనాలు పెంచాలని కోరుతూ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ఆధ్వర్యంలో హమాలీలు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు శంకరయ్య, కార్యదర్శి అంజయ్య, నర్సింహ, స్వీపర్లు ధనమ్మ, లక్ష్మి, శైలజ ఉన్నారు.

నార్కట్‌పల్లి డిపో బస్సులను కేటాయించాలి

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి డిపోకు ఎక్కువ బస్సులను కేటాయించాలని, డిపోను పునరుద్ధరించాలని, డిపోకు పూర్వ వైభవం తేవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రంలో కోరారు. నాయకులు దూదిమెట్ల సత్తయ్య యాదవ్, బత్తుల ఊషయ్య, వడ్డె భూపాల్ ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి

చందంపేట, జూలై 13 : గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి కోరారు. మండలంలోని చిత్రియాల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో జాలె వెంకట్‌రెడ్డి, అండాలమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు నర్సింహారెడ్డి, తిలక్‌రెడ్డి శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో హైదరాబాద్ యశోద ఆస్పత్రికి చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 600 మంది వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామస్తులకు అన్నదానం చేశారు. మాజీ వైస్ ఎంపీపీ జాలె ప్రేమలతానర్సింహారెడ్డి, రుక్మారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ, కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి నిరంజన్, క్యాంప్ చైర్మన్ వనం శ్రీనివాస్, బందెల తిరుపతయ్య, మల్లయ్య, కృష్ణమాచారి, వెంకులయ్య, వెంకటయ్య, వనం భిక్షమయ్య, నీలా బుచ్చయ్య, వైద్యులు నితిన్, మానస, ప్రతిభ, దేవి, శ్రీధర్ పాల్గొన్నారు.

'రేషన్ బియ్యం విక్రయిస్తే చర్యలు'

చందంపేట(దేవరకొండ), జూలై 13 : ప్రజా పంపిణి వ్యవస్థ ద్వారా అందించే రేషన బియ్యం అమ్మినా.. కొన్న చట్టరీత్య కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని దేవరకొండ పౌర సరఫరాల శాఖ అధికారి హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ దేవరకొండ డివిజన్ పరిధిలోని చందంపేట, నేరెడుగొమ్ము, డిండి, చింతపల్లి, దేవరకొండ మండలాల పరిధిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమయానుకూలంగా రేషన్ బియ్యం అందజేయాలని అన్నారు. రేషన్ డీలర్లు సమయపాలనపాటించాలని సూచించారు.

గృహజ్యోతి పథకం దరఖాస్తుల తప్పలను సరిచేయాలి: సీపీఎం

రామగిరి, జూలై 13: గృహజ్యోతి పథకంలో దరఖాస్తుల సమోదులో జరిగిన పోరపాట్లను సరిచేసి అర్హులైన లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ కోసం గృహజ్యోతి పథకంలో దరఖాస్తు చేసుకున్న అనేక మంది అర్హులకు నేటికీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయంలో ప్రజలు ప్రజాపాలనలో చాలా మంది దరఖాస్తులు చేశారని గుర్తు చేశారు. తప్పులను సరిచేసి నిజమైన లబ్ధిదారులకు విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతుల హామీలను వెంటనే అమలు చేయాలి :బీజేపీ

మాడ్గులపల్లి, జూలై 13 : గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించి నేటికి అమలు చేయకుండా రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. అదేవిధంగా రైతులతోపాటు కౌలు రైతులందరికీ రైతు భరోసా పథకం కింద రూ.15వేలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రామలింగారెడ్డి తదితరులు ఉన్నారు.

ఖాళీలు, పదోన్నతుల షెడ్యూల్ ఇవ్వాలి : డీటీఎఫ్

మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖుర్షిద్‌మియా

రామగిరి, జూలై 13: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఖాళీలకు పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసి భర్తీ చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖుర్షిద్‌మియా అన్నారు. శనివారం నల్లగొండలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. బదిలీ అయిన ఎస్‌జీటీ టీచర్లను తక్షణమే రీలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసిన ఉపాధ్యాయులకు న్యాయం చేయలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు ఏ అడ్డంకి లేదని అందుకే వెంటనే ఎంఈఓ పదోన్నతులు కల్పించాలని కోరారు. పాఠశాలల్లో స్కావెంజర్స్‌ను నియమించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకులు, కార్యదర్శులు నాగయ్య, ఏడుకొండలు, వీరయ్య పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

కౌలు రైతుల సమస్యలను తెలుసుకుంటున్న రైతు సంఘం నాయకులు

చిట్యాల, జూలై 13 : కౌలు రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐతరాజు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యుడు అరూరి శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఆరెగూడెం గ్రామంలో కౌలు రైతుల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు రుణ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రైతు బీమా, పంట రుణాలు,రైతు భరోసా ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు లడే రాములు, సుర్కంటి బుచ్చిరెడ్డి, లడే శ్రీను, మురాల అంజయ్య, బైరగొండి శివయ్య పాల్గొన్నారు.

బియ్యం అందజేత

చందంపేట, జూలై 13 : మండలంలోని గాగిళ్లాపురం గ్రామానికి చెందిన సందీప్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్వతి పుత్ర హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు రిమాండ్

దామరచర్ల, జూలై 13 :సూర్యాపేట జిల్లా నుంచి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు వాడపల్లి ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈనెల 5న హుజూర్‌నగర్ నుంచి గుంటూరు జిల్లా దాచేపల్లికి లారీ రేషన్ బియ్యం తరలిస్తుండగా దామరచర్ల వద్ద పట్టుకొని కేసు నమోదు చేశారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్న బియ్యం వ్యాపారస్తులైన గుంటూరు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన కల్లూరి లింగయ్య, జోగుపర్తి ముక్కటేశ్వరరావును శనివారం అదుపులోకి తీసుకొని రిమాండ్ చేసినట్లు చెప్పారు.

నాణ్యమైన నీరా అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: మర్రూర్‌లో మొక్కకు నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, పక్కన ఎక్సైజ్ సీఐ మల్లయ్య

నకిరేకల్, జూలై 13 : ప్రజలకు నాణ్యమైన నీరా అందించడమే లక్ష్యంగా ప్రతి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు, నాలుగు గ్రామాల్లో సొసైటీ స్థలాల్లో తాటి, ఈత వనాలను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నకిరేకల్ మండలం మర్రూర్‌లో కంఠమహేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈత మొక్కను నాటి నీళ్లు పోశారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలను నాటి వాటిని సంక్షరించాల్సిన బాధ్యత ఎక్సైజ్ శాఖపై ఉందన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ వనానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, ఎక్సైజ్ సీఐ మల్లయ్య, ఏపీఓ రమణయ్య, ఎక్సైజ్ ఎస్ఐలు భానుప్రకాశ్, ఎస్‌కే చాంద్‌బీ, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, బచ్చుపల్లి గంగాధర్ రావు, గౌడ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

'పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి'

పదవతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించిన పెన్షనర్స్

రామగిరి, జూలై 13: పెన్షనర్స్ ఎదుర్కోంటున్న సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కారించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నల్లగొండ మండలాధ్యక్షుడు గజవెల్లి సత్యం కోరారు. నల్లగొండలోని సంఘం భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, 5 డీఏలు, ఈహెచ్ఎస్‌ను మంజూరుచేయాలన్నారు. అనంతరం పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పది మంది విద్యార్థులకు సంఘం నుంచి రూ. 1,116 చొప్పున అందజేశారు. అలాగే జన్మదినోత్సవం జరుపుకునే పెన్షనర్స్ సన్మానించారు. కార్యక్రమంలో సుధాకర్, శ్రీశైలం, ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

బాధితురాలికి చెక్కును అందజేస్తున్న నాయకులు

శాలిగౌరారం, జూలై 13 : మండలంలోని బైరవునిబండ గ్రామానికి చెందిన వేముల పద్మకు సీఎం సహాయనిధి నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కు ను మండల కేంద్రంలో శనివారం బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో బైరవునిబండ మాజీ సర్పంచ్ దండ రేణుకా అశోక్‌రెడ్డి, గోదాల నరేందర్‌రెడ్డి, చాడ సురేశ్ రెడ్డి, చామల మహేందర్‌రెడ్డి, వేముల గోపినాథ్, జైపాల్‌రెడ్డి, గోదల వెంకట్‌రెడ్డి ఉన్నారు.

వాడపల్లి ఆలయాల వద్ద ప్రసాదాల విక్రయాలకు రేపు వేలం

దామరచర్ల, జూలై 13 : మండలంలోని వాడపల్లి మీనాక్షి అగస్త్యేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రసాదాల విక్రయాలకు సోమవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఈఓ మృత్యుంజయశాస్త్రీ, ఆలయ కమిటీ చైర్మన్ సిద్దయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20-7-24 నుంచి 19-7-25 వరకు ఏడాది పాటుగా ఆలయాల వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి లడ్డూ, పులిహోర అమ్ముకునేందుకు రూ.20వేలు ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

పెద్దవూర, జూలై 13 : జాతీయ ఉపాధి హామీ పథకం 13వ విడుతలో సామాజిక తనిఖీల్లో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాల యంలో ఉపాధి హామీ పనులపై ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ఏపీడీ నవీన్ కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మండలంలో 26 పంచాయతీల్లో జరిగిన పనులపై తనిఖీ నిర్వహించారు. గుర్తించిన పనుల పై ఖర్చు చేసినట్లు వారు సభ వేదిక మీదుగా ప్రజలు, ప్రజా ప్రతి నిధుల సమక్షంలో తెలిపారు. మస్టర్ల సక్రమంగా లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని వారిని హెచ్చరించారు. అలాగే పనులు జరిగిన స్థలంలో ఏర్పాటు చేయాల్సిన బోర్డులు ఏమయ్యాని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహమ్మద్ ఆసీఫ్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : వైద్యాధికారి రతన్‌స్టెఫీ